క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ: స్థానిక జగనన్న కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని డీఈఈ టి.జె.కె.మూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గానీవీధి, కస్పావీధి, రెల్లివీధి, దేవరపేట, కోమటిపేట బోనంవీధి, వీవర్స్ కాలనీ, పెదకాపువీధి, చిన్నకాపువీధి, నెయ్యాలవీధి, లుంబూరువారి వీధి, సెగిడివీధికి విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాలిథిన్ కవర్లను నిషేధించండి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

జియ్యమ్మవలస రూరల్: పాలిథిన్ కవర్లు, కప్పులను నిషేధించాలని, వాటి స్థానంలో కాగితం కవర్లు, నార సంచులను వినియోగించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పార్థసారథి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఈమేరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ బొంగు సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

జియ్యమ్మవలస రూరల్: మండల కేంద్రంలోని దళితవాడ వాసులు కొన్నాళ్లుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఎవ్వరూ స్పందించకపోవడంతో శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఎం మండల కన్వీనర్ కూరంగి సీతారాం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బి. మోహనరావు, శాంతమ్మ, రజిని, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించాలి



విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేస్తున్న హెచ్ఎం,ఉపాధ్యాయులు

వీరఘట్టం: ఒత్తిడిని అధిగమించి, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.సాంబర పదోతరగతి విద్యార్థులకు సూచించారు.ఈనెల 17న పబ్లిక్ పరీక్షలు ప్రారం భం కానున్న నేపథ్యంలో పాఠశాలలోని 72మంది విద్యార్థులకు శనివారం హాల్ టికెట్లు పంపిణీ చేశారు. పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులను ఉపాధ్యాయులంతా ఆశీర్వదించారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం..

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో మూడు రోజులుగా జరుగుతున్న భీమలింగేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవాలు శనివారంతో ముగిశాయి. గ్రామస్తులు లక్షలాది రూపాయలు పోగుచేసి ఆలయాన్ని నిర్మించారు. ఆలయ అర్చకుల పర్యవేక్షణలో ఆగమ పండితుల ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన పూజలు శనివారం వరకు కొనసాగాయి. చివరి రోజు మధ్యాహ్నం వేలది మందికి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జీ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

వేలానికి వేళాయె...

- వీరఘట్టం మేజర్ పంచాయతీ దుకాణాలకు ముగియనున్న వేలం కాలపరిమితి
- ఈనెలాఖరులోగా దుకాణాల కేటాయింపులకు, మార్కెట్, కారు, బస్ స్టాండ్‌లో ఆశీల వసూళ్లకు వేలం
- ఏటా వేలం పాటను సిండికేట్ చేస్తున్న దళారులు
- గతేడాది పంచాయతీకి వచ్చిన ఆదాయం రూ.7.90 లక్షలు
- దళారులకు దక్కింది సుమారు రూ.7లక్షలకు పైనే
- వేలం పాట పక్కాగా నిర్వహిస్తే పంచాయతీకి రూ.15 లక్షలు వచ్చే అవకాశం



వీరఘట్టంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో పంచాయతీ దుకాణాలు

వీరఘట్టం:

స్థానిక మేజర్ పంచాయతీలో దుకాణాలను ఏటా అద్దె ప్రాతిపదికన కేటాయిస్తుంటారు. గతేడాది నిర్వహించిన వేలం పాట కాల పరిమితి ఈ నెల 31తో ముగియనుంది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి నెలఖారు వరకు కాలపరిమితితో వేలం పాట నిర్వహించేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీ పరిధిలో స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో 6 దుకాణాలు, 2 ఫ్లాట్లు, అలాగే పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా 8 దుకాణాలు ఉన్నాయి. వీటితో పాటు డైలీ మార్కెట్, కారు, బస్ స్టాండ్‌లో ఆశీల వసూళ్లకు ఏటా వేలం పాట నిర్వహిస్తుంటారు.గతేడాది వీటికి వేలం పాట నిర్వహించగా పంచాయతీకి రూ.7.90 లక్షల ఆదాయం వచ్చింది. అయితే దళారులు గతేడాది జరిగిన షాపుల వేలం పాటను సిండికేట్ చేసి సుమారు రూ.7 లక్షలకు పైగా దోచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వేలం పాటను పక్కాగా నిర్వహిస్తే పంచాయతీకి సుమారు రూ.15 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉందని పంచాయతీ వాసులు అంటున్నారు.

అంతా సిండికేట్....

పంచాయతీ షాపులకు వేలం పాట జరుగుతుందని తెలియగానే దళారుల దందా ప్రారంభవుతుంటుంది. అధికారుల సమ క్షంలో జరిగే వేలం పాటను అడుగడుగునా అడ్డుకుంటూ చివరికి సిండికేట్ చేస్తూ నామ మాత్రపు అద్దెలు పంచాయతీకి వచ్చేలా దళారులు చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. దళారుల వల్ల పంచాయతీ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతోందని, ఈ దందాను అడ్డుకోవాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. సంవత్సరానికి ఒకసారి బదులు మూడేళ్లకొకసారి వేలం పాట నిర్వహించాలని, అది కూడా ఉన్నతాధికారులు, పోలీసుల సమక్షంలో అయితేనే అంతా సజావుగా జరుగుతుందని స్థానిక వ్యాపారులు అంటున్నారు. ఏడాదికొకసారి వేలం పాట వేయడం వల్ల దళారులతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఉన్నతాధికారులు ఈ విషయంపై ఆలోచన చేయాలని కోరుతున్నారు.

వేలం పాట పక్కాగా నిర్వహిస్తాం

వీరఘట్టం మేజర్ పంచాయతీ దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు వేలం పాటను పక్కాగా నిర్వహిస్తాం. దళారుల దందా లేకుండా పంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. వేలం పాట అంశాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. వారి నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వేలం పాట నిర్వహిస్తాం.

– బి.వెంకటమరణ, ఎంపీడీఓ, వీరఘట్టం

బాల్య వివాహాలతో అనర్థం..



బాల్య వివాహాలతో అనర్థమని బాల్య వివాహాల నిర్మూలన – జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రసాదరావు అన్నారు. కురుపాం కేజీబీవీలో కిశోర వికాసం పేరిట శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలకు యుక్త వయసు వచ్చిన తర్వాతే వివాహం చేసుకోవాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ అధికారి పి.శ్రీధర్ మాట్లాడుతూ.. పోక్సో చట్టం, చైల్డ్‌లైన్‌పై (1098) అవగాహన కల్పించారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ అధికారి ఎం.రోజారాణి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ యూ.ఉమా, తదితరులు పాల్గొన్నారు. – గుమ్మలక్ష్మీపురం (కురుపాం)

మత్తు పదార్థాలకు దూరం..



విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎల్విన్‌పేట ఎస్సై బి.శివప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. చక్కగా చదువకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. – గుమ్మలక్ష్మీపురం

స్వచ్ఛ గ్రామమే లక్ష్యం..



స్వచ్ఛ గ్రామమే అందరి లక్ష్యం కావాలని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి. గౌరీశంకరావు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ర్యాలీని మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేసి క్లాప్‌మిత్రలకు అందజేయాలన్నారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిశోర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. – గుమ్మలక్ష్మీపురం

వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలి

- వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు

గరుగుబిల్లి: విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని పార్వతీపురం వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు కోరారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వస్తువలు ధరలు, తూనికలు, కొలతల విషయాల్లో వినియోగదారులకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా మోసపోతే వినియోగదారుల సంఘాన్ని సంప్రదించి ఉచితంగా న్యాయ సలహాలను పొందవచ్చునన్నారు. ఫోరం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. మందుల కొనుగోలు విషయంలో వాటి ఖరీదు, తయారీ, ముగింపు తేదీలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది ఏఎల్‌పీ రాజు, ఎన్. మధుసూదనరావు, రాణి, ఆర్.రామకృష్ణ, ఎం.లక్ష్మణరావు, వి.సన్యాసినాయుడు, ఎం. ఈశ్వరరావు, పి.శ్రీనివాసరావు, బి. రంగ, ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నడుకూరులో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీ ఈఓ కోటేశ్వరరావు

వీరఘట్టం: మండలంలోని నడుకూరు గ్రామంలో పంచాయతీ ఈఓ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామంలోని బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్క లను తొలగించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆరుబయట, కాలువల్లో చెత్త పారబోయవద్దని గ్రామస్తులకు ఈఓ సూచించారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



వీరఘట్టం హైస్కూల్‌లో సమావేశమైన పరీక్షల చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లు

వీరఘట్టం: ఈనెల 17న ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో అయిదు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని డిప్యూటీ ఈఓ పత్రి కృష్ణమూర్తి శనివారం సాక్షికి తెలిపారు. గంగమ్మపేట ఆశ్రమ పాఠశాలలో 133 మంది, బి.టి.వాడ హైస్కూల్‌లో 136 మంది, నీలానగరం హైస్కూల్‌లో 159 మంది, వీరఘట్టం హైస్కూల్‌లో 149 మంది, వీరఘట్టం బాలికల ఉన్నత పాఠశాలలో 160 మందితో కలిపి మొత్తం 737 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో ప్రతీ గదిలో 24 మంది విద్యా ర్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో పరీక్షల చీఫ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు ఇన్విజిలేటర్లతో శనివారం సమావేశమయ్యారు.

పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి



లుంబూరులో గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఏడీ మాణిక్యరావు

పాలకొండ రూరల్: పాడి రైతులు పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రభామాణిక్యరావు సూచించారు. మండలంలోని లుంబూరు గ్రామ సచివాలయ పరిధిలో శనివారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 200 పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈసందర్భంగా పాడి రైతులకు ఏడీ మాణిక్యరావు పశు సంరక్షణపై అవగాహన కల్పించారు. వేసవిలో పశువులకు సోకే వ్యాధులు, వాటి లక్షణాలను వివరించారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే జ్వరం వచ్చి, ఆహారం తీసుకోలేక నీరసించి పోతాయన్నారు. నోరు, కాలిగిట్టల వద్ద పుండ్లు ఏర్పడతాయని, ఈ లక్షణాలు కనిపిస్తే తక్షణమే పశు వైద్యులను సంప్రదించాలని సూచించారు. పశువైద్యాధికారి బి.సిద్ధార్థ పాల్గొన్నారు.

జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి..

- రైతు సంఘ నాయకులు



సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: క్వింటా జీడి పిక్కలకు రూ. 20 వేల మద్దతు ధర ప్రకటించాలని జీడిమామిడి రైతుల సంఘ నాయకులు పువ్వల ప్రసాద్, బి.రామ్మూర్తి, సత్తిమ్మ, సుశీల, రాధ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మండలంలోని ఇరిడి గ్రామ సచివాలయం అధికారులను శనివారం కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. జీడిపిక్కలకు మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. జీడిమామిడి ప్రాసెసింగ్ యూనిట్లను ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి ఉపాధి కల్పించడంతో పాటు జీడిమామిడి పరిశోధనా కేంద్రంను పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటు చేయాలని కోరారు. జీడిమామిడి పూత దశలో ఆశించే తేనె మంచు తెగులు నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను ఉచితంగా ఇవ్వాలనిడిమాండ్ చేశారు.

సభ్యులు లేకుండా సర్వసభ్య సమావేశమా..!

- వైస్ ఎంపీపీ సంపత్ ఆగ్రహం



సభ నుంచి బయటకు వస్తున్న సభ్యులు

జియ్యమ్మవలస రూరల్: సభ్యులు లేకుండా సర్వసభ్య సమావేశం నిర్వహించడం నియంతృత్వానికి నిదర్శనమని మండల వైస్ ఎంపీపీ గుడివాడ సంపత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ ఇంజినీరింగ్ అధికారి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే గ్రామాల్లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సి ఉండగా సర్వసభ్య సమావేశం నిర్వహించడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీకి చెందిన వైస్ ఎంపీపీతో పాటు ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు, ఒక జెడ్పీటీసీ సభ్యుడు, పలువురు సర్పంచ్‌లు బాయ్‌కాట్ చేశారు. అనంతరం వైస్ ఎంపీపీ సంపత్ మాట్లాడుతూ.. ఓ వైపు ఎంపీడీఓ సెలవులో ఉండగా, మరో వైపు ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర ర్యాలీల్లో పాల్గొనాల్సి ఉండగా సభ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఒకవేళ తామంతా సభను నిర్వహించేందుకు ఆమోదం తెలిపితే ఆ సంతకాలను పరిగణనలోనికి తీసుకుని ఎంపీపీ బిల్లులు డ్రా చేయడానికి ప్రయత్నిస్తారని ఆరోపించారు. మండలంలో అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని.. అయితే అభివృద్ధి పనుల పేరిట నిధులు భారీగా దుర్వినియోగం చేస్తున్నారన్నారు. సమావేశాన్ని మేము బాయ్‌కాట్ చేసినా ఎంపీపీ బొంగు సురేష్‌తో పాటు ఎంపీటీసీ సభ్యురాలు గుంట్రెడ్డి అన్నపూర్ణమ్మ సంతకాలతో సభ నిర్వహించారని తెలిపారు. మండల ఇంజనీరింగ్ అధికారి ఈ సభకు ఎలా ఆమోదం తెలిపారో చెప్పాలని డిమాండ్ చేశారు. మరోపక్క ఎంపీటీసీ సభ్యుల ప్రమేయం లేకుండా 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో కూటమి నాయకులు, కార్యకర్తల ద్వారా అభివృద్ధి పనులు చేస్తున్నారని విమర్శించారు. ఇదిలా ఉంటే సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల అధికారులు సంబంధిత పనులపై ఎంపీపీ బొంగు సురేష్‌కు వివరించారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శనివారం నిర్వహించిన దాడుల్లో 150 సారా ప్యాకెట్లు స్వాధీనపర్చుకోవడంతో పాటు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుపాంలోని రెల్లివీధిలో రాయిపిల్లి అప్పారావు అనే వ్యక్తి 100 సారా ప్యాకెట్లతో పట్టుబడ్డాడని, ఈ వ్యక్తికి సారా సరఫరా చేసిన ఒడిశా రాష్ట్రం సందుబడి గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అంతే కాకుండా గుమ్మలక్ష్మీపురం మండలం టిక్కబాయి గ్రామంలో దాడులు నిర్వహించగా పువ్వల ప్రసాద్ అనే వ్యక్తి వద్ద 50 సారా ప్యాకెట్లు పట్టుబడ్డాయన్నారు. దీంతో అతనిపై కూడా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

రాధాకృష్ణుల విగ్రహాల ఊరేగింపు



రాధాకృష్ణుల ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

బామిని: మండలంలోని కాట్రగడ–బి గ్రామంలో హోలీ పండగ నేపథ్యంలో రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలను హరేరామ నామ సంకీర్తన బృందం ఆధ్వ ర్యంలో శనివారం ఊరేగించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను వంశదార నదిలోకి తీసుకువెళ్లి పవిత్ర స్నానాలు చేయించారు.

స్వచ్ఛాంధ్ర అందరి బాధ్యత..

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ తద్వారా స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రం చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తామని, పాలిథిన్ ఉత్పత్తులను నిషేధిస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



కొమరాడ: విక్రంపురంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు



గరుగుబిల్లి : మండల కేంద్రంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ప్రత్యేకాధికారి ఓ. ప్రభాకర్, అధికారులు



వీరఘట్టంలో ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ, పంచాయతీ సిబ్బంది



సీతంపేట: పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



పాలకొండలో ర్యాలీ చేస్తున్న నగరపంచాయతీ కమిషనర్ జయరాం, మెప్మా సిబ్బంది, కౌన్సిలర్లు



బామిని: నేరడి గ్రామంలో ప్రతిజ్ఞ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి అనసూయ, సర్పంచ్ జగదాంబ

రెల్లి కులస్తులకు న్యాయం చేయాలి

పార్వతీపురం టౌన్: రెల్లి కులస్తులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆ సంఘ నాయకులు జి. డేనియల్, పి. రాజశేఖర్, ఎస్. గౌరీశంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఇందిరాకాలనీ కూడలి వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద రెల్లి కులస్తులతో శనివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల మంది రెల్లి, ఉపకులాలు వారు ఉన్నారని.. వారికి విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో ఒకశాతం రిజర్వేషన్ ప్రకటించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి 5 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ ప్రకారం రెల్లి, ఉపకులాలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె. నానాజీ, కె. సుధాకర్, ఎస్. శ్రీకాంత్, జి. శరత్ చైతన్య పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

పార్వతీపురం: రోజురోజుకీ ఎండ తీవ్రత ఎక్కువవుతున్న దృష్ట్యా జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు జి. వెంకటరమణ కోరారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు తాగునీటికి ఇబ్బంది పడకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యాక్రమంలో పి. సన్యాసిరావు, బి. లక్ష్మి, రెడ్డి శ్రీదేవి, సూర్యనారాయణ, వెంకటరమణ ఉన్నారు.